ఆర్టీసీ బస్సులు రాక అవస్థలు

- గ్రామాలకు ఆర్టీసీ సేవలు కరువు
- ఆటోలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- గతంలో నడిపిన బస్సులను పునరుద్ధరించాలని వేడుకోలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ సేవలు కరువయ్యాయి. ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. హుజూర్‌నగర్ మండల కేంద్రం, ఇతర పట్టణాలకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ప్రమాదకరం అని తెలిసినా ప్రైవేటు వాహనాల్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల కంటే ఎక్కువే ఆటో చార్జీలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించి పది నెలలు కావస్తున్నా మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఉచిత ప్రయాణానికి నోచుకోలేకపోతున్నారు.



ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న ప్రయాణికులు

ప్రయాణికులకు ఇబ్బందులు..

మండలంలోని కరక్కాయలగూడెం, బూరుగడ్డ, మాచవరం, గోపాలపురం తదితర గ్రామాల ప్రజలు కోదాడ ఆర్టీసీ డిపో నడిపే బస్సుల ద్వారా కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడెం తదితర పట్టణాలకు వెళ్లేవారు. గతంలో కోదాడ డిపో నుంచి కోదాడ, బాలాజీనగర్, చిలుకూరు, కరక్కాయలగూడెం, బూరుగడ్డ, గోపాలపురం నుంచి హుజూర్‌నగర్ మీదుగా మంతంపల్లి మండలంలోని మంచ్యాతండా వరకు ఆర్టీసీ బస్సు నడిపేవారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. కానీ కోదాడ డిపో అధికారులు ఈ బస్సు సర్వీసును అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో సదరు గ్రామాల ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి కోదాడ టు మంచ్యాతండా వయా కరక్కాయలగూడెం బూరుగడ్డ, గోపాలపురం, హుజూర్‌నగర్‌కు బస్సులను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



హుజూర్‌నగర్ మండలానికి గతంలో వచ్చిన ఆర్టీసీ బస్సు

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామానికి ఆర్టీసీ బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు రాకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నాం. ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బస్సు టికెట్ కంటే ఆటోవాలాలు చార్జి ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దిగిపొమ్మంటున్నారు.

– ఎస్‌కె ఇమాం, కరక్కాయలగూడెం

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి



ఆటోలో ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉంది. సమయానికి ఆటోలు రావడం లేదు. ఒకవేళ వచ్చినా సరిపడా జనాలు వచ్చేవరకు వేచి చూడాల్సిందే. కొన్నిసార్లు ఆటోల్లో ఎక్కుదామంటే ఖాళీ ఉండటం లేదు. దీంతో ఆడవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి.

– సురభి నాగరాజు, బూరుగడ్డ

క్లుప్తంగా

నారాయణపురం వాసికి జాతీయ అవార్డు



కేంద్ర మంత్రి జీతూ లాల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జానకిరామ్

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన డాక్టర్ జానకిరామ్‌కు ఎంబీబీఎస్ ఎమర్జెన్సీ ఫిజిషియన్ విభాగంలో నేషనల్ ఎమర్జెన్సీ ఫిజీషియన్ ఆఫ్ ది ఇయర్ – 2024 అవార్డు లభించింది. ఢిల్లీలో ఈ నెల 20వ తేదీన జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి జీతూ లాల్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. వైద్య వృత్తిలో తాను చేసిన సేవలను గుర్తించి తనకు ఈ అవార్డు ఇచ్చినట్లు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



గుర్వయ్య కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

నడిగూడెం : మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బండారు గుర్వయ్య (32) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతునిది నిరుపేద కుటుంబం. దీంతో గుర్వయ్య చిన్న నాటి మిత్రులు శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో లంజపల్లి వీరబాబు, షేక్.నాగుల్ మీరా, షేక్.రహిముద్దీన్, బండారు శ్రీను, సత్యం, సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి



మిగడంపహాడ్‌తండాలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కాటయ్య

పాలకవీడు : విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఎంఈఓ ఇంజమూరి కాటయ్య అన్నారు. శుక్రవారం పాలకవీడు మండలంలోని మిగడంపహాడ్‌తండా, రాఘవపురం, హనుమయ్యగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా బోధన, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యంపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



నీటిశుద్ధి యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ

గరిడేపల్లి : మండలంలోని కట్టకొమ్ముతండా ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన నీటిశుద్ధి యంత్రాన్ని శుక్రవారం పాఠశాలలో ఎంఈఓ పి.చత్రునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.శివయ్య, అంగన్‌వాడీ టీచర్ పద్మ, రాజమ్మ, ఉపేందర్, నరేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్లీనరీని జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ నాయకులు

మునగాల : హైదరాబాద్ శివారులోని ఆదిభట్లలో నవంబర్ 3వ తేదీన నిర్వహించ తలపెట్టిన ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) తొలి ప్లీనరీని విజయవంతం చేయాలని పార్టీ మునగాల మండల కన్వీనర్ పిడమర్తి నరేష్ మహారాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఆయన ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల ప్రకారం అగ్రవర్ణ భూస్వామ్య వ్యవస్థపై బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. 90 శాతం మంది అణగారిన వర్గాలు తమ సొంత రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ కమిటీ సభ్యులు పిడమర్తి ఏసు, పాతకుంట్ల వెంకటేష్, పాలకుంట్ల విజయ్, బత్తిని నవీన్, ఎస్‌కె.రఫీ, ఉప్పరి సందీప్, మామిడి ఏసు, మామిడి నరసింహా, బెనర్జీ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం ప్రారంభం



అన్నదాన కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న గ్రామపెద్దలు, అయ్యప్ప మాలధారులు

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయంలోని అన్నప్రసాద వితరణ కేంద్రంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి మాట్లాడుతూ 41 రోజుల పాటు కొనసాగే ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామానికి చెందిన పలువురు దాతలు సహకారం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నల్లపాటి శ్రీనివాస్, కందిబండ సత్యనారాయణ, వంగవేటి వెంకటగురుమూర్తి, పెనుగొండ వెంకట దుర్గాప్రసాద్, గాయం సత్యనారాయణరెడ్డి, గురుస్వాములు పెంటకొట్టు సురేష్, బొబ్బిలి సంజీవరెడ్డి, వల్లోజు వెంకన్న, నలబోలు కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు నరమనేని రామారావు గురుస్వామి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

నేడు 'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

చిలుకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి హామీ పనులపై మండల సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాబు, ఏపీఓ నిర్మల శుక్రవారం విలేకరులకు తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు ఖర్చు చేసిన 4 కోట్ల 34 లక్షల 38 వేల 34 రూపాయలపై సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామ స్థాయి సామాజిక తనిఖీ పూర్తయినట్లు వారు తెలిపారు.

సాగర్ సిమెంట్స్ పరిశ్రమలో రక్తదాన శిబిరం

మఠంపల్లి : మఠంపల్లి సమీపంలో గల సాగర్ సిమెంట్స్ పరిశ్రమలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశ్రమ వీపీ రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు తెలిపారు. ఈశిబిరంలో 90 యూనిట్ల రక్తాన్ని సేకరించి నల్లగొండలోని రెడ్‌క్రాస్ సొసైటీకి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ మెడికల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పరిశ్రమ వీపీ రమణమూర్తి, వైద్యాధికారి శ్రీలక్ష్మి

కార్పొరేట్ హెయిర్ సెలూన్‌కు అనుమతులివ్వొద్దు



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

నేరేడుచర్ల : పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే కార్పొరేట్ హెయిర్ సెలూన్‌కు అనుమతులివ్వొద్దని కోరుతూ శుక్రవారం నాయీబ్రహ్మణుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు మోగరాల వాసు మాట్లాడుతూ.. కార్పొరేట్ హెయిర్ సెలూన్ నెలకొల్పితే, వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న నాయీ బ్రాహ్మణులు రోడ్డున పడే ప్రమాదం ఉందని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సత్యనారాయణ, శ్రీను, నాగయ్య, లక్ష్మణ్, ఉదయ్, వీరస్వామి, రాంప్రసాద్, వెంకన్న, శివ, నాగరాజు, సతీష్, ఉపేందర్, కార్తీక్, నాగరాజు, వీరబాబు తదితరులు ఉన్నారు.

ముగిసిన గనుల భద్రతా వారోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న మై హోం పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు

మేళ్లచెరువు: మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో నిర్వహిస్తున్న గనుల భద్రతా వారోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ పి.వసంతకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మేళ్లచెరువు, వేపలమాధవరం, చౌటపల్లిలలో పరిశ్రమకు చెందిన గనులలో అధికారులు, సిబ్బంది భద్రత పాటిస్తుండడపై ఆయన ప్రశంసించారు. గనుల భద్రతపై పరిశ్రమ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, సన్యాసినాయుడు, శివారెడ్డి, భానుప్రసాద్, విద్యాకిరణ్, చందు, మదన్‌మోహన్, జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, అప్పలరాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వ్యాపారాలతో మోసపోవద్దు

నడిగూడెం : ఆన్‌లైన్ వ్యాపారాలతో మోసపోవద్దని నడిగూడెం ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కొద్ది రోజులుగా కొత్త కొత్త ఆన్‌లైన్ వ్యాపారాలు, యాప్‌లు పుట్టుకొస్తున్నాయని, ప్రజలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దన్నారు. మండలంలో ఈ మధ్యకాలంలో ఆర్– జీపీ యాప్ సంస్థ ఎత్తివేయడంతో అందులో పెట్టుబడి పెట్టిన అనేక మంది నష్టపోయారన్నారు. ఆన్‌లైన్ యాప్‌ల పట్ల మండల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు.

కిందితండా జాబితాలోకి పక్క ఊరి ఓట్లు

- విచారణ జరపాలని గ్రామస్తుల వినతి

మఠంపల్లి : మండలంలోని కిందితండా గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలోకి పక్క గ్రామమైన చెన్నాయిపాలెంకు చెందిన సుమారు 20 ఓట్లను అక్రమంగా చేర్చారని, ఈ విషయమై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కిందితండా తాజా మాజీ సర్పంచ్ భరత్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ఓటర్ల ముసాయిదా జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించినప్పుడు ఎలాంటి మార్పులు, చేర్పులు లేవని, కానీ రెండు రోజుల క్రితం ఓటర్ల జాబితా పరిశీలించగా చెన్నాయిపాలెంకు చెందిన ఓట్లు తమ ఓటర్ల జాబితాలో ఉన్నట్లు తెలిపారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తే తనకు తెలియదని కంప్యూటర్ ఆపరేటర్లు చేర్చారేమో అని సమాధానం చెప్పారని తెలిపారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికల జరగనున్నందున ఎవరో కావాలనే కుట్ర చేశారని, అధికారులు విచారణ జరపాలన్నారు. ఈవిషయమై తాము ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చింటూనాయక్, భుక్యా నాయక్, హనుమాన్‌సింగ్, బాబురావు, శంకర్, నరేష్, తదితరులు ఉన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్, నాయకులు

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు 30 వరకు గడువు

గరిడేపల్లి : ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు ఓపెన్ స్కూల్ గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ షేక్ ఖాజా మొహినుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌ను ఒకే ఏడాదిలో పూర్తిచేసే అవకాశాన్ని ఓపెన్ స్కూల్ కల్పిస్తుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 6304949238 సంప్రదించాలని కోరారు.

భక్తుల సౌకర్యార్థం.. పరిసరాలు పరిశుభ్రం

చిలుకూరు : చిలుకూరు మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణం చుట్టూ, రామాపురం వెళ్లే దారిలో శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు జేసీబీతో బాగు చేయించారు. అదేవిధంగా ఆలయం పక్కనే ఎస్ఎస్‌పీ 9– ఆర్ కాలువ ఉండడంతో కార్తీక మాసంలో మహిళలు పూజలు చేసుకునేందుకు సౌకర్యంగా ఉండేందుకు అక్కడి పరిసరాలను వారు పరిశుభ్రం చేయించారు. కార్తీక మాసంలో మహిళలు దీపాలు వెలిగించుకునేందుకు వీలుగా వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



రామాపురం వెళ్లే దారిని బాగు చేయిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వీరభద్రి మృతి సీపీఐకి తీరని లోటు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు చింతల వీరభద్రి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తెల నారాయణ రెడ్డి, మండల కార్యదర్శి చింత్రియాల రవి అన్నారు. వీరభద్రి డయేరియాతో మృతి చెందారు. శుక్రవారం ఆయన మృతదేహంపై వారు ఎర్రజెండా, పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నాయకులు చిత్తలూరి వీరబాబు, గోనే లక్ష్మి, చినఅంకయ్య, తోకల సైదులు, కాటిబోయిన అచ్చయ్య, రామకృష్ణ, గురవయ్య, పుల్లయ్య, తదితరులు ఉన్నారు.

కళాకారుల ఐక్యతతోనే కళారంగం అభివృద్ధి

హుజూర్‌నగర్ : కళాకారులు ఐక్యతతోనే కళారంగం అభివృద్ధి చెందుతుందని కళాకారుల సంక్షేమ సంఘం నాయకుడు దొంతగాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాకారులు అందరూ కలిసి నాటక రంగాన్ని బతికించుకుందామని అన్నారు. కళాకారులకు ప్రపంచ కళాకారుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుంట్ల చంద్రసేన గుప్తా వర్ధంతి

నేరేడుచర్ల : వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా వర్ధంతిని శుక్రవారం పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీ గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవి క్లబ్ జోన్ చైర్మన్లు కొత్త లక్ష్మణ్, వీరవల్లి శ్రీలతలు మాట్లాడారు. ఆత్మ విశ్వాసం, సేవా భావంతో కేసీ గుప్తా వాసవి క్లబ్‌ను స్థాపించారని, నేడు వాసవి క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి నిరుపేదలకు సేవ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు గెల్లి లక్ష్మి, వాసవి, వనితా క్లబ్‌ల ప్రధాన కార్యదర్శులు జూలూరు అశోక్, చెరుకు కవిత, తాళ్లూరి శ్రీనివాస్, గరిణే జ్యోతి, కందిబండ శ్రీనివాస్, నటరాజ్, ప్రసాద్, పరమేశం, రాము, పుల్లయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



కేసీ గుప్తా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసవి, వనితా క్లబ్‌ల సభ్యులు

ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దు



నడిగూడెం : నారాయణపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నడిగూడెం : రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని తహసీల్దార్ వి.సరిత అన్నారు. శుక్రవారం నడిగూడెం మండలంలోని నారాయణపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, మండల వ్యవసాయ అధికారి రాయపు దేవప్రసాద్, ఏపీఎం రామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాంపల్లి సతీష్, ఏఈఓ రేణుక, సీసీ సాంబయ్య, రైతులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోదాడరూరల్ : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందజేసే మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ పొందాలని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ పీఏసీఎస్ పరిధిలోని గణపవరం, కూచిపూడి, బండపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నాణ్యవంతంగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమాల్లో ఇర్ల సీతారాంరెడ్డి, సుమన్‌రెడ్డి, బుడిగం నరేష్, డైరెక్టర్లు ప్రభాకర్‌రావు, కమతం వెంకటయ్య, గోబ్రా, కాసాని పుల్లయ్య, శెట్టి శ్రీనివాసరావు, శిరంశెట్టి వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.



కోదాడరూరల్ : గణపవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యారోగ్య శాఖ యూనిట్ అధికారి సురేందర్ కోరారు. శుక్రవారం నడిగూడెంలో నిర్వహించిన డ్రై డే- ఫ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలు కాలనీల్లో నిల్వ ఉన్న మురుగు నీటి ప్రాంతాలను పరిశీలించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇళ్లల్లో గల పూల కుండీలు, కూలర్లు, ఫ్రిజ్‌ల వెనుక ఉండే నీటిని తొలగించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి అమర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు సునీత, శ్రీలక్ష్మి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



నడిగూడెంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న అధికారులు

బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్

హుజూర్‌నగర్ : ఆపద సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు అండగా నిలుస్తుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్ యరగాని నాగన్నగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని మంత్రి ఉత్తమ్ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చింతకాయల రాము, కె.వినోద్, టి.వీరబాబు, ఎం.రామకృష్ణ, లక్ష్మణ్, గురవయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెం, కిందితండాలో లబ్ధిదారులకు మంజూరైన రూ.81 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం మాజీ జెడ్పీటీసీ భూక్యా నీలామంజీనాయక్.. స్థానిక మాజీ సర్పంచ్ భూక్యా నాగునాయక్‌తో కలిసి పంపిణీ చేశారు. చెన్నాయిపాలెంకు చెందిన గణేష్‌నాయక్‌కు రూ.60వేలు, కిందితండాకు చెందిన ప్రవీణ్‌నాయక్‌కు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భూక్యా సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి : సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ నీలామంజీనాయక్

మహా రుద్రాభిషేకాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి



మహా రుద్రాభిషేకం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ ముత్తయ్య, కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపు ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 27 నిర్వహించబోయే మహారుద్రాభిషేకాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ ముత్తయ్య అన్నారు. శుక్రవారం మహా రుద్రాభిషేకం నిర్వహణ ఏర్పాట్లను కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

27న మాంసం దుకాణాలు బంద్..

మహారుద్రాభిషేకం సందర్భంగా 27వ తేదీన (ఆదివారం) హుజూర్‌నగర్ పట్టణంలో మాంసం విక్రయాలు నిర్వహించకూడదని మున్సిపల్ కమిషనర్ యాకుబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చికెన్, మటన్, చేపలు ఇతర మాంసం దుకాణాలు బంద్ చేయాలని ఆయన కోరారు.

బూరుగడ్డ ఆలయంలో కుంకుమార్చన

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో కుంకుమార్చనను అర్చకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామి వార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో ఎంసీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

విద్యార్థుల అభివృద్ధే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యం

చివ్వెంల : గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభివృద్ధే కస్తూరి ఫౌండేషన్ లక్ష్యమని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అనంతుల మధు, ఆ సంస్థ ప్రతినిధులు రామక్రిష్ణ, మహేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బి.చందుపట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో కస్తూరి ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగులు, గ్రామర్ బుక్స్, డిక్షనరీలు, జాతీయ నాయకుల చిత్రపటాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకు నగేష్, గుద్దేటి చిన్న వెంకన్న, భుక్యా వెంకన్న, కోడి రవి, గుద్దేటి మధుసూదన్, శిగ నాగరాజు, కోడి లక్ష్మణ్, ముక్కంటి, మల్లేష్, బయ్య కేసీఆర్, ఉపాధ్యాయులు గురుమూర్తి, రామ్మూర్తి, అరుణశ్రీ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.